## ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణకు ఆదేశం

**ప్రజాశక్తి- టెక్కలి రూరల్**

టెక్కలి జిల్లా ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పసికందు తొడలో సూది ఉండిపోయిన ఘటనపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విచారణకు ఆదేశించారు. విధి నిర్వహణలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించకుండా నిర్లక్ష్యంపై ఆస్పత్రి పర్యవేక్షకులను ప్రశ్నించారు. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

# బిల్లులకు అను'గృహ'మెప్పుడో..?

- ఎన్‌టిఆర్ గృహ పథకం కింద లక్షలాది మందికి ఇళ్లు
- వైసిపి ప్రభుత్వ హయాంలో రెండుసార్లు సర్వే
- గతేడాది సెప్టెంబర్‌లో మూడోసారి తనిఖీ
- రూ.50.33 కోట్లు పెండింగ్

**వారంతా గత టిడిపి ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ లబ్ధిదారులు. ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఇళ్లు నిర్మాణాలూ ప్రారంభించారు. వారిలో కొందరికి మొదటి విడత వరకు బిల్లులు చెల్లించింది. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోయినా, ఎప్పటికైనా డబ్బులు వస్తాయన్న నమ్మకంతో అప్పో సప్పో చేసి ఇళ్లు కట్టుకున్నారు. కొందరికి అప్పు పుట్టకపోవడంతో మధ్యలోనే ఇళ్లను ఆపేశారు. ఇళ్లు నిర్మించి ఆరేడు సంవత్సరాలు కావస్తున్నా బిల్లులు రాకపోవడతో, ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు చవిచూస్తున్నారు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక సతమతమవుతున్నారు వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు సర్వే చేసినా డబ్బులు మాత్రమ జమ చేయలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది సెప్టెంబర్‌లో తాజాగా సర్వే చేపట్టారు. దీంతో ఇళ్ల బిల్లులు వస్తాయని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బూర్జ మండం అల్లినలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

జిల్లావ్యాప్తంగా 2017-19 కాలంలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద సుమారు నాలుగు లక్షల మందికి మందికి గృహాలు మంజూరయ్యాయి. వీటిలో బిసిలకు 1.50 లక్షలతో స్కీమ్ ఒకటి కాగా, మరొకటి ఎస్‌సిలకు రూ.రెండు లక్షల స్కీమ్. వాటిలో ఇళ్లు మంజూరై ఒక్క పైసా రాని వారు, కొంతమేర సొమ్ములు వచ్చిన వారూ ఉన్నారు. ఇళ్లు పూర్తయిన వాటికి బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం, అప్పటికి ఇంకా ఎవరూ ఇళ్లను పూర్తి చేయలేకపోవడంతో, లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులను జమ చేయలేదు. దీంతో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా తమ సొంత డబ్బులతో పునాదులు, రూఫ్ లెవల్ పనుల వరకు చేపట్టారు. తమ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఉన్న పళంగా ఇంటి నిర్మాణ పనులు ఆపేశారు. కొందరికి పునాదులకు రూ.10 వేలు, 15 సిమెంట్ బస్తాలూ ఇచ్చారు. వారు పునాదులు వేసి వదిలేశారు. బిల్లుల కోసం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో మిన్నకున్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో రెండు సార్లు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తాజాగా ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు నాలుగు నెలలు పాటు సర్వే చేశారు. సర్వేలో గుర్తించిన లబ్ధిదారులు, వారికి చెల్లించాల్సిన నగదు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గృహ నిర్మాణాలకు సంబంధించి జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ప్రకారం జిల్లాలో రూ.50.35 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి.

### రెండు పర్యాయాలు వెరిఫికేషన్

టిడిపి హయాంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు చెల్లించేందుకు తొలుత వైసిపి ప్రభుత్వం నిరాకరించింది. లబ్ధిదారుల నుంచి ఒత్తిళ్లు, ప్రజాప్రతినిధుల వినతులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం బిల్లులు చెల్లించేందుకు అంగీకరించింది. టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను వెరిఫికేషన్ చేయాలని నిర్ణయించింది. అర్హులను గుర్తించేందుకు 2022 డిసెంబర్‌లో గృహనిర్మాణ శాఖ సిబ్బంది, గ్రామ, వార్డు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సర్వే చేయించింది. వారంతా అర్హులేనని అధికారులు నిర్ధారించారు. గతేడాది జూన్‌లోనూ మరోసారి పరిశీలించారు. అందులోనూ వారు అర్హులేనని తేల్చారు. సర్వేలు చేసినా లబ్ధిదారులకు డబ్బులు మాత్రం చెల్లించలేదు.

### ముచ్చటగా మూడోసారి తనిఖీ

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత మూడోసారి ఇళ్ల తనిఖీ ప్రక్రియ చేపట్టారు. గతేడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు గ్రామాల్లో నిర్వహించారు. జిల్లాకు సంబంధించి లబ్ధిదారులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీన చెల్లిస్తామని ఇటీవల ప్రకటించినా చెల్లించే పరిస్థితి కనిపించడం లేదు. పైగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇప్పట్లో డబ్బులు చెల్లించే అవకాశం లేదు.



# 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

- అమల్లోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**నోటిఫికేషన్ జారీ : 3 ఫిబ్రవరి**
**నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ : 10 ఫిబ్రవరి**
**నామినేషన్ల పరిశీలన : 11 ఫిబ్రవరి**
**అభ్యర్థుల ఉపసంహరణకు చివరి తేదీ : 13 ఫిబ్రవరి**
**పోలింగ్ తేదీ : 27 ఫిబ్రవరి**
**పోలింగ్ వేళలు : ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు**
**ఓట్ల లెక్కింపు : 3 మార్చి**
**ఎన్నికల ప్రక్రియ పూర్తి : 8 మార్చి**

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 27వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆరోజు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నామని చెప్పారు. పోలింగ్‌కు సంబంధించిన అన్ని రకాల ప్రక్రియలను జిల్లా అధికార యంత్రాంగం ప్రారంభించిందన్నారు. ఎన్నికల సంఘం వెలువరించిన షెడ్యూల్ ప్రకారం జనవరి 29వ తేదీ నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని తెలిపారు. 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రాంతాల్లో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం వెలువరించిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని తెలిపారు. ఆ రోజు నుంచి అన్ని ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని చెప్పారు. పదో తేదీ సాయంత్రం మూడు గంటలతో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందన్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి మూడో తేదీన కౌంటింగ్ ప్రారంభమవుతుందని, ఎనిమిదో తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని వివరించారు.

జనరల్ అభ్యర్థులు రూ.పది వేలు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ.ఐదు వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫారం-26 ద్వారా అఫిడవిట్ సమర్పించాలన్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఇప్పుడూ అన్నిరకాల నిబంధనలు అభ్యర్థులకు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

### ఓటర్లు 4,829... పోలింగ్ కేంద్రాలు 31

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లా పరిధిలో 4,829 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 3,275, కాగా మహిళా ఓటర్లు 1,554 మంది ఉన్నారని తెలిపారు. అర్హత కలిగిన వారు నామినేషన్ ప్రక్రియ ముగియడానికి పది రోజుల ముందు వరకు జనవరి 31వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూరుస్తున్నామని చెప్పారు.

### ప్రవర్తనా నియమావళి అమలు పర్యవేక్షణకు 30 బృందాలు

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ, వీడియోగ్రాఫర్‌తో కూడిన 30 ఎంసిసి బృందాలను మండలానికి ఒకటి చొప్పున నియమించామని చెప్పారు. మండలానికి ఒకటి చొప్పున తహశీల్దార్, ఎస్ఐ, వీడియోగ్రాఫర్‌తో 30 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

అరసవల్లి సందర్శిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్

# పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉద్యోగ సంఘ నాయకులు కె.శ్రీనివాసు, ఎం.ప్రభాకరరావు, పి.సుధాకరరావు కోరారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాలలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాళ్లతో పాటు అధ్యాపకులను కలిసి తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఆమె ఉద్యమ అనుభవాలను వివరించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన కలిగి నిజాయితీ గల అభ్యర్థి విజయగౌరి అని అన్నారు. ప్రభుత్వంతో ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపకుల సమస్యలపై పోరాడ గల వ్యక్తి అని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థని నిర్వీర్యం చేస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో ఆ విధానాలను సరిచేసే పోరాటాలను ముమ్మరం చేయడానికి ఎమ్మెల్సీ ఎన్నికలను వేదికగా చేసుకోవాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలను పరిష్కరించడానికి ఆమె పోరాడతారని తెలిపారు.

ప్రచారం చేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

# రథసప్తమి వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

- యాత్రికులకు అసౌర్యం లేకుండా చర్యలు
- దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి ఆలయంలో ఈనెల రెండు నుంచి నాలుగో తేదీ వరకు నిర్వహిస్తున్న రథసప్తమి వేడుకల్లో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన బందోస్తు ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారు. నగరంలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని గురువారం సందర్శించిన ఆయన, రథసప్తమి వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ సంప్రదాయానికి భంగం కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ముందుగా ఆలయ భౌగోళిక మ్యాపుతో పాటు ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధాన సింహద్వారం, సందర్శన మార్గాలు, బారికేడ్లను పరిశీలించారు. క్యూలైన్లు, ప్రవేశ ద్వారం, మండపం, ఇంద్రపుష్కరిణి, ఉచిత సందర్శకుల మార్గం, ప్రసాద విక్రయాల కౌంటర్లు, కేశఖండన యాత్రికులకు అందించాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. రాష్ట్ర పండగ నేపథ్యంలో సందర్శకుల తాకిడి పెరిగే అవకాశం ఉందని, అందువల్ల పోలీసు శాఖ సమర్థవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్, అన్నప్రసాదాల వితరణ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థల కోసం పలు ప్రదేశాల కేటాయింపును అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణ పటిష్టవంతమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. క్యూలైన్ మేనేజ్‌మెంట్ క్రమపద్ధతిలో ఉండాలని, యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తోపులాటకు తావు లేకుండా తగిన జాగ్రత్తలను పాటించాలన్నారు. సమావేశంలో శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, విశాఖపట్నం కనకమహాలక్ష్మి ఆలయ డిప్యూటీ కమిషనర్ శోభారాణి, విజయనగరం డిసి కె.ఎన్.డి.వి ప్రసాద్, స్తపతి శ్రీనివాసాచార్యులు, టి.దుర్గేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి వై.భద్రాజీ పాల్గొన్నారు.

# వర్గీకరణపై స్పష్టమైన ప్రకటన చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సి వర్గీకరణపై అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలిచ్చినా, ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నింగి నాగరాజు విమర్శించారు. వర్గీకరణపై ఫిబ్రవరి 7వ తేదీ లోగా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో గురువారం నిర్వహించిన ఎంఆర్‌పిఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌సి వర్గీకరణ అమలు కోరుతూ 7వ తేదీన హైదరాబాద్‌లో లక్ష డప్పులతో భారీ సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ ఆలస్యమైతే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాల్లో మాదిగలు లబ్ధి పొందేలా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి రానా శ్రీనివాసరావు, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# పాడి అభివృద్ధికే పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

గొర్రెకు మందు వేయిస్తున్న జెడి రాజగోపాలరావు

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.రాజగోపాలరావు అన్నారు. మండలంలోని రామచంద్రాపురంలో గురువారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ శిబిరంలో పశువులకు సాధారణ చికిత్సలు, గర్భకోశ వ్యాధి చికిత్సలు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు, పేడ, రక్త పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందులు తాగించుట పలు వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. పశువ్యాధులపై రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రైతులకు సూచనలు, సలహాలు, రైతులు అడిగిన పలు ప్రశ్నలను నివృత్తి చేశారు. ముఖ్యంగా లాభసాటి పాడి పరిశ్రమ కోసం ఏకవార్షిక, బహువార్షిక పశు గ్రాసాల సాగుపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన, వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. గొర్రెలు, మేకలు అధిక సంఖ్యలో ఈ గ్రామంలో ఉన్నందున పెంపకందారులకు పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. శిబిరంలో గొర్రెలు, మేకలకు మశూచి వ్యాధి నివారణ టీకాలు వేశారు. శిబిరంలో స్థానిక సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు, పశు వైద్యులు డాక్టర్ వై.హేమలత, బి.యోగేశ్వరరావు, సాంధ్ర గొర్రెల అభివృద్ధి సంస్థ లైవ్స్టాక్ అసిస్టెంట్ బి.ఇందిర, జూనియర్ వెటర్నరీ అధికారి డి.ఆదిలక్ష్మి, పి.రాంబాయి, ల్యాబ్ టెక్నీషియన్ బి.సుమతి, పశువైద్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన జగన్

### ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మార్చేశారని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.పది లక్షల కోట్ల అప్పు చేశారని, దానికి ఏడాదికి రూ.71 వేల కోట్ల అసలు, రూ.1.40 లక్షల వడ్డీ చెల్లింపుల భారంతో ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడు నెలల కాలంలో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి జగన్ ప్రభుత్వం పెట్టిన రూ.22 వేల కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రానికి అప్పులు కూడా పుట్టని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఏడాదికి రూ.71 వేల కోట్ల అసలు, వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి వల్ల కూటమి ప్రభుత్వానికి గుదిబండగా మారిందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి విలాసాలు, జల్సాలకు రూ.19,871.35 కోట్లను దుబారా చేశారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి కుటుంబం అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఐదేళ్ల కాలంలో లిక్కర్ ఇసుక అసైన్డ్ భూములు బీచ్‌శాండ్, గంజాయి, డ్రగ్స్ ఇలా పలు మార్గాల్లో ఎనిమిది లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపించారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే కుష్టు నిర్మూలన

### డిఎంహెచ్ఒ బాలమురళీకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజల భాగస్వామ్యంతోనే కుష్టు వ్యాధి నిర్మూలన సాధ్యమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.బాలమురళీకృష్ణ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో కుష్టు నిర్మూలన దినోత్సవ ర్యాలీని గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీ వరకు 15 రోజుల పాటు పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కుష్టు వ్యాధిపై వైద్య సిబ్బందికి అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కుష్టు వ్యాధిని గుర్తించడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

ఈ సర్వేలో స్పర్శ లేని తెల్ల మచ్చలు ఉంటే, అటువంటి వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందిస్తామన్నారు. స్పర్శ లేని మచ్చలున్న వారు తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీనిపై సరైన అవగాహన లేక పరీక్షలు చేయించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారని, మందులు వాడితే నయం కాగల ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు వీలుందన్నారు. ర్యాలీలో డిఎల్ఒ డాక్టర్ శ్రీకాంత్, డిపిఎంఒ వాన సురేష్ కుమార్, డిఎన్ఎంఒ ప్రవీణ్, డెమో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ బాలమురళీకృష్ణ

**IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM 1st ADL DISTRICT JUDGE AT SRIKAKULAM**
**M. V. O. P. 34/2023**

Between:-
**Md Rukshana Bibi** .....Petitioner
And:-
**Vanjarapu Santosh Kumar and 2 others** .....Respondents

**NOTICE**

To,
**R-2: Laxmi Swathi,**
D/o N P Sastry,
Owner of the Motor Cycle,
Motor Cycle No:AP-31/EA-1944,
Residing at Dr.No.44-24-21/1,
Kanna Rao Street,
Railway New Colony,
Visakhapatnam town and District.

Please take notice that the above matter is posted to **12-02- 2025 at 10.30 A.M.** for your notice to appear before the Hon'ble court either in person or through an advocate for filing your counter if any failing which the matter will be heard in your absence.

**L. GOVINDA RAJULU**
**ADVOCATE FOR THE PETITIONE,**
**SRIKAKULAM,**
**CELL: 9440251705**

# గాంధీజీ ఆశయాలు ఆదర్శనీయం

శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

కవిటి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వాతంత్ర్య సమపార్జనలో బ్రిటిష్ పాలకులపై శాంతి, అహింస మార్గాన్ని ఎంచుకుని ఉద్యమించారని ఆయన బాటలోనే ప్రతిఒక్కరూ నడచు కోవాలని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు అన్నారు. ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో గాంధీ వర్ధంతిని పురష్కరించుకుని ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం నిరంతరాయంగా పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కెవిఎల్ ఎస్.ఈశ్వరి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, సాయిదుల్లాఖాన్, అంబటి దాలినాయుడు, చాన్ భాష, అనుపోజు రవికుమార్, గంగు కొండలరావు, పలపాల రమేష్‌కుమార్, సునీల్ బాషా, అంబటి లక్ష్మణరావు, చోడవరం చంద్రరావు, లీలావతి, సురియా బేగం తదితరులు పాల్గొన్నారు.

అలాగే నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిర భారత స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సంస్కర్తల స్మృతివనం 4వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి బర్ల ప్రసాదరావు హాజరై మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలను ఒకేచోట కొలువుదీర్చి భావితరాలకు మహనీయుల త్యాగాలను తెలియజేసే ప్రయత్నం ఎంతో గొప్పదన్నారు. తొలుత గాంధీ మందిరం ఆవరణలో 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, సరోజ, పైడి హరనాథ రావు, నిష్టల నర్సింహమూర్తి, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, సురంగి మోహనరావు, ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, బలివాడ మల్లేశ్వరరావు, నిక్కు అప్పన్న, వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, బరాటం లక్ష్మణరావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణ్, నటుకుల మోహన్, కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**కవిటి:** గాంధీజీ ఆశయాలు ఆదర్శనీయమని కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిందు మాధవి అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్వతంత్ర ఉద్యమంలో గాంధీ పాత్ర, దేశం కోసం ప్రాణాలు సైతం పణంగా పెట్టిన గాంధీ జీవిత చరిత్రను ఉపాధ్యాయుడు సంతోష్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పాతపట్నం :** కోర్టు ఆవరణలో గాంధీ చిత్రపటానికి రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వైకుంఠరావు, జిల్లా సత్యసాయి జాయింట్ సేవాదళ్ కో-ఆర్డినేటర్ కె.వి.రమణమూర్తి, పాతపట్నం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఎన్.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, పి.చిన్నారావు,ఎస్.తిరుపతిరావు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గాంధీ చిత్రపటానికి చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, సునీత, శాంతి, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ తేజస్, సెక్రటరీ మోహన్‌ప్రియా, వైస్ ప్రెసిడెంట్ జి.హారిక, జాయింట్ సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి జోత్స్న పాల్గొన్నారు.

**కోటబొమ్మాళి :** స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహానికి గాంధీ సేవా సమితి ప్రతినిధులు నౌగాపు నాగరాజు, సుసరాపు చంద్రశేఖర్‌శర్మలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సకల భక్తుల త్రినాథ్, తలగాపు వెంకటరమణ, ఖాదీ బాండర్ మేనేజర్ కవిటి నాగేశ్వరరావు, సుసరాపు సూరిబాబు, సుసరాపు కృష్ణబాబు, శిరసాన శ్రీనివాస్ యాదవ్, జామి శేఖర్, కూన భాస్కర్, నౌపడ కామేశ్వరావు, సకలాభక్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**పలాస :** పలాస-కాశీబగ్గ మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి చైర్మన్ బల్ల గిరిబాబు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, శార్వాణి గీత, సనపల సింహాచలం, బెల్లాల శ్రీనివాసరావు, సవర సోమేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, జోగ త్రివేణి, తంగుడు ఆశాలత, జ్యోతి నాయక్ పాల్గొన్నారు. మండలంలో బ్రాహ్మణతర్లాలో గాంధీ బజార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వూన కృష్ణమోహన్, వూన రత్నాకర్, వడ్డీ యాదగిరి, ఆళ్ల కృష్ణారావు ఆపల్గొన్నారు. ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణారావు, ఉపాధ్యాయులు బమ్మిడి కిషోర్‌కుమార్, ఇ.ఈశ్వరరావు, కె.శ్రీనివాసరావు, దువ్వాడ జనార్ధనరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

**పోలాకి:** మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహానికి ఎంపిడిఒ జి.రవికుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఇఒపిఆర్‌డి పద్మావతి, ఎపిఒ రమణారావు పాల్గొన్నారు.

**మందస :** మండలంలోని భైరిసారంగపురం, బెల్లుపట్టియా గ్రామాల్లో నిర్వహించిన పశువైద్య శిబిరాల్లో హరిపురం పశు వైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతిలు పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. దూడలకు అంతర పరాన్న జీవులు మందులు తాగించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ధర్మేంద్ర, ధనుంజయరావు, బాలకృష్ణ, శ్రీను, సంతోషి, హరికృష్ణ పాల్గొన్నారు.

పలాస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న చైర్మన్, తదితరులు

**టెక్కలి:** జనసేన కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కుమారస్వామి, గవరయ్య, త్రివేణిరావు, గిరి లక్ష్మణ పాల్గొన్నారు.

**ఆమదాలవలస:** పట్టణంలోని వన్ వే జంక్షన్ వద్ద నున్న గాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు వన్ వే జంక్షన్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లఖినేని నారాయణరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బస్వా షణ్ముఖ రావు, సనపల రాజులు, బొత్స రమణ, లఖినేని సాయిరాం, అప్పారావు, దాలయ్య, గురుగుబెల్లి కృష్ణమూర్తి, పప్పల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**పొందూరు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.ఉదయ్‌లక్ష్మి ఆధ్వర్యంలో మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.కార్యక్రమంలో ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డా.సూర్యారావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ రవి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

## లీజు రద్దయ్యే వరకూ పోరాటం

### వ్య.కా.స జిల్లా అధ్యక్షులు ప్రసాద్

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని నివగాం ఆర్‌టిసి కాంప్లెక్స్ లీజు రద్దయ్యే వరకూ పోరాటం ఆగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ స్పష్టం చేశారు. నివగాంలో గురువారం స్థానిక పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, ప్రయాణికులు సౌకర్యార్థం 1995లో ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను నిర్మించారని అన్నారు. గతేడాది ప్రయివేటు వ్యక్తులకు ఆర్‌టిసి అధికారులు పదేళ్లకు లీసుకు ఇచ్చారని అన్నారు. లీజుదారుడు ప్రయాణికులు, విద్యార్థులు ఆర్‌టిసి కాంప్లెక్స్‌లోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా నాలుగు వైపులా షాపులు నిర్మించారని అన్నారు. దీంతో ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ప్రయాణికులకు నీలువ నీడ లేకుండా చేశారని అన్నారు. శ్రీకాకుళం, పలాస, టెక్కలి, ఒడిశా రాష్ట్రాల నుంచి రోజూ బస్సులు వస్తూ... పోతూ ఉంటాయని అన్నారు. ఇలా వేలాది మంది వచ్చే ప్రయాణికులకు ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో నీడలేకుండా చేయడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఉన్నతాదికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలవెల్లి రాంబాబు. పూర్ణచంద్ర పట్నాయక్, బి.చిన్నారావు, బూరాడ ధర్మారావు, సాన గోపాల్, ఉగాది పాల్గొన్నారు.

## రణస్థలం బంద్ సక్సెస్

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై ప్రభుత్వం నిర్మాణం చేపట్టనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి వ్యతిరేకంగా రణస్థలం ఫ్లైఓవర్ వ్యతిరేక కమిటీ రణస్థలం బంద్‌కు పిలుపునిచ్చింది. గురువారం రణస్థలం బంద్ సక్సస్ అయింది. అన్ని వర్గాల వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. అదే విధంగా పబ్లిక్, ప్రైవేట్ బ్యాంక్‌లు, వివిధ సంస్థలు స్వచ్ఛందగా మూసివేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడటం జరిగిందని త్వరలో సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు. ఈ బంద్‌కు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలిపిన నాయకులు, వ్యాపారులు, పోలీస్ సిబ్బందికి కమిటీ తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

వినతిపత్రాలను స్వీకరిస్తున్న కవిత

## 210 దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- పలాస

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం ఖృషి చేస్తుందని, అందులో భాగంగా డివిజన్ పరిధిలో విభిన్న ప్రతిభావంతులు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కొల్లి కవిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ కె.వసంత కుమార్ ఆధ్వర్యాన ఎయిర్పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేసేందుకు గురువారం అర్హత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు రూ.50 లక్షలు సిఎస్ఆర్ కింద ఎయిర్పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఖర్చు చేస్తోందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన ఆప్టిమైజ్డ్ వర్క్‌లు, అత్యంత నైపుణ్యం కలిగిన వర్కోర్స్ తయారీ సౌకర్యాలతో అధిక నాణ్యత గల పరికరాలను అందించడానికి అర్హులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి మూడు చక్రాల బ్యాటరీ వాహనాలు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలను అందిస్తామని చెప్పారు. అర్హత పరీక్షలకు 210 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు, కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

**ఇచ్ఛాపురం :** గీతా, శ్రీశయన, గౌడ్ తరగతులకు కేటాయించిన మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రోహిబిషన్ ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీ, కవిటి మండలంలో మద్యం షాపులు శ్రీశయనలకు కేటాయించామన్నారు. ఇచ్ఛాపురంలో గౌడ్‌లకు కేటాయించామన్నారు. అర్హులు రూ.2 లక్షలు డిడితో పాటు ధ్రువీకరణ, తదితర పత్రాలను జతచేసి అందజేయాలన్నారు. కలెక్టర్ సమక్షంలో ఫిబ్రవరి 8న ఉదయం పది గంటలకు మద్యం షాపులు పొందిన వారి పేర్లు ప్రకటిస్తామన్నారు.

## విజయగౌరిని గెలిపించుకుందాం

**కోటబొమ్మాళి:** ఉత్తరాంధ్రా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించుకుందామని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గొండు నారాయణరావు అన్నారు. యుటిఎఫ్ బృందంతో కలిసి మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, జిజెసి, కెజిబివి పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడడానికి, ఉపాధ్యాయ ఉద్యమాలకు అండగా నిలబడడానికి యుటిఎఫ్ బలపరిచిన డిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరి పోటీ చేస్తున్నారని అన్నారు. ఆమెకు మనందరి ప్రతినిధిగా శాసనమండలికి పంపించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ మండల నాయకులు బోడల ఆనందరావు, పంగ సింహాచలం, గోవిందరావు, హరిహరరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

## వైసిపి వల్లే ఈ దుస్థితి

### ఎమ్మెల్యే రమణమూర్తి

**నరసన్నపేట :** రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్లు అప్పుల ఊబిలో నెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ తన సొంత కుటుంబ విలాసల కోసం, కమీషన్ల కోసం ఆంధ్రప్రదేశ్‌ను అప్పులు రాష్ట్రంగా మార్చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల నుంచి గట్టెకించి, స్వర్ణంధ్రప్రదేశ్‌గా మార్చే శక్తి సిఎం చంద్రబాబుపైనే ఉందన్నారు.

## విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి- కవిటి

ప్రస్తుత రోజుల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్య నేర్పించాలని, రోజురోజుకూ దిగజారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను భవిష్యత్ తరాలకు వారదులుగా తయారు చేయాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ అధ్యాపకులకు సూచించారు. స్థానిక కళ్యాణి జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ వేడుకలు లోళ్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భవిష్యత్ భారతం భావితరాలపై ఆధారపడి ఉందని, దాంట్లో విద్యార్థులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు.

మాట్లాడుతున్న రాజేష్

విద్యార్థులు కేవలం తరగతి గది పాఠాలకే పరిమితం కాకుండా సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు, కళ్యాణి కాలేజ్ అధ్యాపక సిబ్బంది, మేనేజ్‌మెంట్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు విద్యుత్ స్తంభాలు అడ్డు

- స్తంభాలు తొలగించేదెప్పుడు..?
- రహదారి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు..?

రోడ్డు మధ్యలో నిర్మాణాలకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి- పొందూరు

పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా చేపడుతున్న రోడ్లు, కాలువల నిర్మాణాలకు, అభివృద్ధి పనులకు విద్యుత్ స్తంభాలు అడ్డుగా నిలుస్తున్నాయి. గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదేశిస్తున్నా పనులకు రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంబాలు నిరోధకాలుగా మారుతున్నాయి. విద్యుత్ స్తంబాలు మార్చాలంటే నిభందనల ప్రకారం డిడిలు తీయాల్సిందేనని విద్యుత్ శాఖాధికారులు స్పష్టం చేస్తుంటే విద్యుత్ స్తంబాలు మార్పునకు ప్రభుత్వం ప్రత్యేక నిధులేమీ మంజూరు చేయడం లేదు. దీంతో రోడ్డు నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపేయాల్సి వస్తోంది. మండలం తాడివలసలో ప్రధానవీధిలో చేపడుతున్న రోడ్డు, కాలువ పనులకు విద్యుత్ స్తంబాలు అడ్డుగా ఉన్నాయి. గ్రామ సర్పంచ్ మనెమ్మ విద్యుత్ స్తంబాలను మార్చాలని స్థానిక విద్యుత్ శాఖాధికారులను కోరుతున్నా స్తంబాల మార్పునకు డిడిలు తీయాల్సిందేనని విద్యుత్ అధికారులు కరాకండిగా చెప్పడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో సుమారు నెల రోజులకుపైగా నిలిచిన రోడ్డులో రాకపోకలు సాగించలేక ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

## పక్కాగా సర్వే

ప్రజాశక్తి- బూర్జ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వమిత్వ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వెంకట రమణ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలో బూర్జ, కొల్లివలస, గుత్తావల్లి, చీడివలస గ్రామాలను సందర్శించి స్వామిత్వ సర్వేను ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ కంఠంలో అనుభవంలో ఉన్న వారికి హక్కు కల్పించడానికి ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలని, ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ పక్కగా చేయాలన్నారు. ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించాలని, ఏ ఒక్క కుటుంబం తప్పిపోరాదని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలకు పారిశుధ్యంపై ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.కిరణ్, సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న డిఎల్‌పిఒ

## వైద్య శిబిరానికి స్పందన

**శ్రీకాకుళం అర్బన్ :** అంతర్జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురష్కరించుకుని నగరంలోని లెప్రసీ కాలనీలో లయన్స్‌క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు, క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈశిబిరంలో 150 మంది రోగులను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న సన్‌రైజ్ ఆస్పత్రిలో ప్రతి శనివారం ఉచితంగా ఔట్‌పేషెంట్లకు బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం రోగులకు అల్పాహారాన్ని అందజేశారు. శిబిరంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు టెక్కలి గోపి, పాడుగు చరణ్, తేజ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఆర్‌పిఎఫ్ పోలీసులు

## రైలు ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- పర్లాకిమిడి

రైల్వే గేట్ వద్ద రైలు వస్తున్నప్పుడు గేట్ వేస్తారని, రైలు వెళ్లే వరకూ ఆగాలని, అప్పుడే ప్రమాదాల నియంత్రణ సాధ్యమని ఆర్‌పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు, కానిస్టేబుల్ సిహెచ్.శంకరరావు అన్నారు. గజపతి జిల్లా కాశీనగర్ రైల్వే గేట్ వద్ద రైల్వే ప్రొటెక్షన్ ఫోర్, (నౌపడ అవుట్ పోస్టు) ఆధ్వర్యాన వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేలైన్‌కు ఆనుకొని ఉన్న భూముల యజమానులు రైల్వే స్థలములో పాతి ఉన్న వైర్లను తొలగించడం సరికాదన్నారు. గుర్తించిన వెంటనే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. రైల్వే తమ అవసరాల కోసం ప్రయివేట్ వ్యక్తుల భూమి కొనుగోలు చేసిన తరువాత కూడా కొందరు రైతులు ఆ భూమిని సాగు చేస్తున్నారని, అందువల్ల రైల్వే భూమి ఏదో? తమ భూమి ఏదో? సరిచూసుకొని ఏ పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో లెంక జైశంకర్, ఎల్.సామంతరాయ్, రామారావు పాల్గొన్నారు.

## విద్యా ప్రదాత పాపారావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఉపాధ్యాయ వృత్తి సంతృప్తినిచ్చిందని సీతానగరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బొడ్డేపల్లి పాపారావు అన్నారు. ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందనున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే... టెక్కలి మండలం గోపినాథపురానికి చెందిన పాపారావు తల్లిదండ్రులు నారాయణ, కూర్మమ్మ వ్యవసాయదారులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. ఇందులో రెండు సంతానంగా పాపారావు 1963 జనవరి 5న జన్మించారు.

### విద్యాభ్యాసం

స్వగ్రామం గోపినాథపురం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు, టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, టెక్కలి డిగ్రీ కళాశాలలో బిఎ పూర్తి చేశారు. విజయనగరంలో డైట్, శ్రీకాకుళం గాయత్రిలో బిఇడి, ఎంఇడి, ఆంధ్రా యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేశారు.

### ఉద్యోగ నేపథ్యం

1989లో ఉపాధ్యాయునిగా ఎంపికై నందిగాం మండల గొల్లరు ప్రాథమిక పాఠశాలలో మొదటి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నౌగాం, కర్లపూడి, టెక్కలి మండలం బూర్గం, చిన్నలక్ష్మీపురం, మండల రీసోర్సుపర్సన్‌గా ఐదేళ్ల పాటు సేవలు అందజేశారు. మరలా టెక్కలి బజార్ పాఠశాల, టెక్కలి ఒరియా పాఠశాలలో పనిచేశారు. స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొంది పెద్దసాన ప్రభుత్వం ఉన్నత, సీతానగరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో విధులు నిర్వహించారు.

### కుటుంబ నేపథ్యం

పాపారావు మాస్టారుకు భార్య వజ్రం, కుమారుడు ఉదయ్, కోడలు ఆశ, కుమార్తె మాధురి, అల్లుడు మొదలవలస సునీల్‌కుమార్ ఉన్నారు. కుమారుడు, కోడలు స్టాఫ్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. కుమార్తె, అల్లుడు డాక్టర్లుగా పనిచేస్తున్నారు.

పాపారావు, వజ్రం

### సంతృప్తినిచ్చిన అంశాలు

అన్ని సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉండడంతో విద్యార్థులకు పోటీ పరీక్షలపై తర్ఫీదు ఇవ్వడం, యోగాలో నిష్ణాతులు కావడంతో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, పేద విద్యార్థులకు సహాయ, సహకారాలు అందించడం, వ్యవసాయంపై మక్కువతో నూతన వంగడాలతో తనదైనశైలిలో సాగు చేయడం, ఎక్కువకాలం విద్యార్థులతో గడపడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు.

## ఇద్దరు కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ఉన్న అపిటోరియా ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ (అరబిందో) పరిశ్రమలో గురువారం సంభవించిన ప్రమాదంలో విజయనగరానికి చెందిన మెంటీనెన్స్ కాంట్రాక్టర్ వర్కర్ పి.రమేష్, రెల్లివలసకు చెందిన మెంటీనెన్స్ ఎంప్లాయి ఐ.నర్సునాయుడు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... పరిశ్రమలోని యుటిలిటీ-6లో పనిచేస్తుండగా యంత్రాలు కూలింగ్‌లో ఉంచేందుకు వాడుతున్న టవర్ ఫ్యాన్లు తగిలి గాయపడ్డారు. వెంటనే పరిశ్రమకు చెందిన అంబులెన్స్‌లో విజయనగరం తిరుమల ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. స్వల్ప గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## హైదరాబాద్‌లో వలస కూలీ మృతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

యోగేశ్వరరావు (ఫైల్)

వలస కూలిగా హైదరాబాద్‌లో ఎన్నో ఏళ్లుగా పనులు చేసుకుంటున్నా ఓ వ్యక్తి బుధవారం మృతి చెందారు. మండలంలోని ముక్తాపురానికి చెందిన గుమ్మడు యోగేశ్వరరావు కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో గృహ నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22న హైదరాబాద్ రింగ్ రోడ్‌లో టాటా మ్యాజిక్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందారు. మృతదేహం స్వగ్రామానికి తీసుకొచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య దేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

## బైక్‌ల చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

**టెక్కలి రూరల్ :** ద్విచక్ర వాహనాలు చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని, ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని సిఐ అంబటి విజయకుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు, జనవరి నెలల్లో ద్విచక్ర వాహనాల చోరీ కేసులు నమోదయ్యాయని అన్నారు. డిఎస్‌పి ఆదేశాల మేరకు క్రైమ్ పార్టీ నియమించి కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. టెక్కలికి చెందిన పడాల అఖిల్ సాయంతో ఒడిశా నుంచి నలుగురు ఈ నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. అయితే ఇందులో ముగ్గురిని మాత్రమే అరెస్టు చేశామని, మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందని అన్నారు. అందులో ఇద్దరు మైనర్లు ఉన్నారన్నారు. టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు బైక్‌లు, పార్వతీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, ఒడిశా రాష్ట్రం మునిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి దొంగలించారని అన్నారు. వారి వద్ద నుంచి ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముగ్గురినీ కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

## ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యునిగా యాదగిరి

యాదగిరి

**పలాస :** పలాస నియోజకవర్గ ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యునిగా మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన వడ్డీ యాదగిరి (దాలయ్య) ఎంపికయ్యారు. ఈ కమిటీలో ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చైర్మన్‌గా ఉంటారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సమస్యలను పరిష్కరించేందుకు కమిటీ పనిచేస్తుందని తెలిపారు. జిల్లా దళిత సాధికారత పార్లమెంట్ సభ్యునిగా, బ్రాహ్మణతర్లా గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష, నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, మాజీ మంత్రి గౌతు శివాజీ, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. టిడిపి బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందేలా చూస్తానని తెలిపారు.

## మున్సిపల్ బడ్జెట్ సమావేశం వాయిదా

**పలాస :** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా మున్సిపల్ బడ్జెట్ సమావేశం వాయిదా పడింది. చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన గురువారం సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం కోడ్ అమలులో ఉన్న కారణంగా బడ్జెట్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 2025-26కు గాను బడ్జెట్ సమావేశం నిర్వహించాల్సి ఉంది.

**మండల...**

**కొత్తూరు :** మండల పరిషత్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి ఉన్నందున చర్చించకుండానే వాయిదా వేశారు. సమావేశంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంపిడిఒ కె.నీరజ, ఎఒ బసవ రాంబాబు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## వైసిపి లీగల్ సెల్ అధ్యక్షునిగా శివకుమార్


శివకుమార్

**ఎచ్చెర్ల :** ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి లీగల్ సెల్ అధ్యక్షునిగా ఫరీద్‌పేటకు చెందిన కోటిపాత్రుని శివకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది. శివకుమార్ తండ్రి కోటిపోత్రుని విశ్వనాథం రెండుసార్లు ఎంపిటిసిగా, ఎచ్చెర్ల వైస్ ఎంపిపిగా పనిచేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తనకి అప్పగించిన బాధ్యత తూచా తప్పకుండా పాటిస్తానన్నారు. ఎమ్మెల్సీ బొత్స సత్య నారాయణ, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, విజయనగరం జిల్లా జెడ్‌పి చైర్మన్ చిన్న శ్రీనుకు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

## కూటమి ప్రభుత్వం మోసం

**మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**

**ప్రజాశక్తి- పాతపట్నం**

ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ప్రజలకు నమ్మించిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు ఎర చూపించి ప్రభుత్వం వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ చూస్తే భయమేస్తుందని, ప్రస్తుతం ఇవ్వలేమని చేతులెత్తేయడం సరికాదన్నారు. నీతి ఆయోగ్ నివేదికపై చంద్రబాబు అసలు స్వరూపం తెలిసిందన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి సవిరిగాన ప్రదీప్, ఏడుగుల సూర్యం, కొండల అర్జునరావు, తూలుగు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో కృష్ణదాస్

## ఐక్యంగా ముందుకు సాగుదాం

**ప్రజాశక్తి- నరసన్నపేట**

అందరమూ ఐక్యమత్యంగా ఉండి ముందుకు సాగుదామని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం కార్యకర్తలతో, నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. అనంతరం వారికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సన్యాసినాయుడు

## వృద్ధాశ్రమం సందర్శన

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

నగరంలోని సానావీధిలో ఉన్న మథర్ థెరిస్సా వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు గురువారం సందర్శించారు. ఆశ్రమంలో వసతి సౌకర్యాలను పరిశీలించిన ఆయన అక్కడ ఉండే వృద్ధుల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లను, పండ్లను అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు పంపిణీ చేస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

## ఎరువుల పంపిణీ

**ప్రజాశక్తి- బూర్జ**

మండలంలోని మొక్కజొన్న రైతులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఫిబ్ సాల్ ప్యాకెట్ ఎరువును ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఎఫ్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు మాట్లాడుతూ ఈ ఎరువు మొక్కజొన్న పంట యొక్క పెరుగుదల, నేల సారాన్ని కాపాడుతుందన్నారు. ఇందులో భాగంగా గ్రామ రైతులు మాట్లాడుతూ గత రెండేళ్లుగా మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో డాక్టర్ రెడ్డీస్ అందించే సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రైతులు విజ్జిరాజు చౌదరి, గంగు రమేష్, డిఆర్ఎఫ్ సమన్వయ కర్త డి.ఏసు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్‌తో నిలిచిన మండల సమావేశం

**ప్రజాశక్తి- సరుబుజ్జిలి**

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి కిల్లి రమాదేవి అధ్యక్షతన నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకితో నిలిపివేశారు. ముందుగా పంపిన సమాచారం మేరకు జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి గోవింద, వెంకట శివానందమూర్తి, మండల ప్రత్యేక ఆహ్వానితులు కెవిజి సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అన్ని శాఖల అధికారులు సర్వసభ్య సమావేశానికి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. సమావేశ మందిరంలో అందరిని సమావేశ పర్చిన ఎంపిడిఒ ఎం.పావని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటనతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని దీనివలన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. వెంటనే సభ్యులు, అధికారులు అక్కడ నుంచి వెనుదిరిగారు.

## జాతర ఏర్పాట్లు పరిశీలన

**ప్రజాశక్తి- రణస్థలం రూరల్**

కమ్మ సిగడాంలో ఫిబ్రవరి 7 నుంచి మూడు రోజులు జరిగే శ్రీ మహాలక్ష్మీతల్లి జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ మేరకు గురువారం జె.ఆర్.పురం సిఐ ఎం. అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి జాతర స్థలాన్ని పరిశీలించారు. పార్కింగ్ స్థలం, తదితర విషయాలు కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, సభ్యులు గురాల రఘునాథ్, ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలస్తున్న సిఐ అవతారం తదితరులు

# ఇబ్బందులు లేకుండా పనులు

**ప్రజాశక్తి- పలాస**

మండలంలోని బ్రాహ్మణతర్లా పెద్దవీధిలో తాగునీటి కుళాయి, సిసి రోడ్డు నిర్మాణాలు గత నిర్మించిన ఉద్దానం తాగునీటి పైపులైన్లకు ఇబ్బంది లేకుండా పనులు చేపడతామని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ డిఇ జి.రవిబాబు అన్నారు. పెద్దవీధిలో లీక్ అవుతున్న పైపులైన్, నిర్మించనున్న సిసి పనుల కోసం కూటమి నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధిలో పది అడుగుల వెడల్పుతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టి రోడ్డుకు రెండు వైపులా అడుగు వెడల్పులో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు స్థలం విడిచి పెట్టాలని సూచించారు. వీధికి రెండు వైపులా 200 మీటర్లు పొడుగునా త్వరలో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేస్తామని చెప్పారు. సిసి రోడ్డు, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు కోసం ఇబ్బంది

పరిశీలిస్తున్న సూర్యనారాయణ, రవిబాబు

లేకుండా పనులు చేపడతామని చెప్పారు. అలాగే మండలంలోని ఈదురాపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లు పనులను పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వడ్డీ యాదగిరి, ఆళ్ల కృష్ణారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ దానేటి వెంకటేష్, తామడ మోహనరావు పాల్గొన్నారు.

# 'ఐతమ్' విద్యార్థుల ప్రతిభ

**టెక్కలి రూరల్:** టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు భీమవరం ఎస్ఆర్‌కెఆర్ కళాశాల ఆవరణలో ఈ నెల 22 నుంచి 26 వరకు చిన గోకార్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఐతమ్ విద్యార్థులు 30 మంది పాల్గొని ప్రతిభ కనపరచి మొదటి స్థానాన్ని కైవశం చేసుకున్నారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గోకార్టింగ్ పోటీలో వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 11 బృందాలు పాల్గొనగా, ఐతమ్ గోకార్ట్ స్పార్టన్స్ పేరుతో పాల్గొని 'కాస్ట్ ప్లాన్ ప్రెజంటేషన్' అనే అంశంపై మొదటి బహుమతి సాధించిదని అన్నారు. మెకానికల్-21, సిఎసిఇ-3, సిఎస్ఎం-4, ఇసిఇ -2, ఐటి-1 చొప్పున పోటీలో పాల్గొన్నారని వివరించారు. ఐతమ్ స్పార్టన్స్ గోకార్ట్స్ మెంటార్లుగా సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.రఘువీర్,

విజేతలను అభినందిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

గోకార్ట్ క్లబ్ మెంటారు ఎం.వంశీనారాయణ వ్యవహరించారని అన్నారు. విజేతలకు డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐఐసి కన్వీనర్ డాక్టర్ జి. సతీష్‌కుమార్, హెచ్‌డిలు డాక్టర్లు పి.శ్రీహరి, వై.రమేష్, చంద్రశేఖర్, పి.రమేష్‌నాయుడు అభినం దించారు.

# ఎన్నికల హామీలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

**రణస్థలం:** సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆరోపించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా 9 నెలలు కాలయాపన చేసిందన్నారు. సూపర్ సిక్స్ అనే తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొంతు సూర్య నారాయణ, మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, జి. సిగడాం మండల అధ్యక్షులు డోల వెంకట రమణ, జిల్లా సెక్రటరీ యాక్టివిటీస్ పేడాడ శ్రీరామ్ మూర్తి, అంబటి రాంబాబు, గురాన తిరుమల మానస, మజ్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవిత ధ్రువీకరణ పత్రం కోసం ఫొటో తీసున్న సంఘ సభ్యులు

## నేరుగా జీవిత ధ్రువీకరణ పత్రాలు

**ప్రజాశక్తి- పొందూరు**

అస్వస్థతతో కదలలేని స్థితిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులకు కుటుంబ ఫెన్షన్‌దారులకు స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నేరుగా జీవిత ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నారు. గురువారం పొందూరు, వాండ్రంగి, లోలుగు తదితర గ్రామాల్లో ఈ ప్రక్రియను చేపట్టారు. ఇప్పటివరకు పలు గ్రామాలకు చెందిన 40 మందికి ఈ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఫిబ్రవరి చివరి వరకూ ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సూర్య ప్రకాశరావు, వాండ్రంగి దామోదరరావు, వడగా సూర్యారావు, పాలవలస దివాకర్ పాత్రో తదితరులు పాల్గొన్నారు. కదలలేని స్థితిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులు జీవిత ధ్రువీకరణ పత్రాల కోసం 9441249793 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు, పొందూరు శాఖ అధ్యక్షులు నాళం పైడిరాజులు పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

**కవిటి:** కవిటిలో కొత్తగా ఏర్పాటు చేసిన 33/11 కెవి సబ్ స్టేషన్, రాజపురం 33/11 కెవి సబ్ స్టేషన్లలో మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సబ్ స్టేషన్ల పరిధిలోని కవిటి, కొత్తూరు, గొండ్యాలపుట్టుగ, ప్రగడపుట్టుగ, రాజపురం, భైరిపురం, నెలవంక, సహలాలపుట్టుగ, శిలగాం, జగతి, కపాసుకుద్ది, లండారిపుట్టుగ గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**జి.సిగడాం :** మండలంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి జి.సిగడాం ఉపకేంద్రం పరిధిలో ఉన్న విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. మండలంలో జి.సిగడాం, బాతువ, గెడ్డ కంచరం, నడిమివలస, జాడ, ఎందువపేట, సేతు భీమవరం, గొబ్బూరు, నిద్దాం, అద్దోనంపేట, చెట్టు పొదిలం, మదుపాం, వెలగడ, చంద్రయ్య పేట, దేవరావలస, ఆర్‌సిహెచ్ పురం తదితర గ్రామాలకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వికలాంగుల క్రికెట్ జట్టు ఎంపిక

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, వికలాంగుల సంక్షేమశాఖ సంయుక్తంగా గురువారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జిల్లా వికలాంగుల క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ప్రారంభించారు. రాష్ట్ర వికలాంగుల క్రికెట్ సంఘం చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, సభ్యులు సురవరపు రామన్ సుబ్బారావు, ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డిలు ఈ పోటీలను పర్యవేక్షించారు. జిల్లా క్రికెట్ సంఘం జిల్లా క్రికెట్ సంఘం కౌన్సిలర్ డా.సువ్వారి రవికుమార్ హాజరై క్రీడాకారులను అభినందించారు. ఈఎంపిక పోటీలకు నాలుగు కేటగిరీల్లో 57 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 9న రెండో విడత ఎంపికలు

ఎంపికైన వికలాంగుల క్రికెట్ జట్టు

నిర్వహించనున్నారు. ఈ ఎంపికలో జిల్లా వికలాంగుల క్రికెట్ సంఘం అధ్యక్షులు జి.పి నాయుడు, కోచ్ సుదర్శన్, ఆనంద్, రాజు, హేమంత్, అనుపమ రాం పాల్గొన్నారు.

## ప్రయాణికులకు భద్రత కల్పించాలి

**టెక్కలి :** ఆర్‌టిసి బస్సులో ప్రయాణం చేసే ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం కల్పించాలని టెక్కలి రోడ్డు రవాణా శాఖాధికారి ఎం.సంజీవరావు అన్నారు. జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్‌టిసి డిపో ఆవరణలో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ... అప్రమత్తంగా ఉండాలన్నారు. టెక్కలి సిఐ ఎ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ డ్రైవర్ మానసిక ధైర్యంతో తన విధులను నిర్వర్తించాలన్నారు.

## విద్యార్థులకు అభినందనలు

**టెక్కలి :** టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కిల్లాన మేరీ, సోండంగి రోహిణీ, బుడితి ఆశ్వినిలను ప్రిన్సిపాల్ కె.కిరణ్మయి, అధ్యాపకులు గురువారం అభినందించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అత్యున్నత మార్కులు సాదించిన వీరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన బేటీ బచావో, బేటీ పడవో కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడా జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. విజేతలుగా నిలిచిన వీరికి ఒక్కొరికీ రూ.2,500 నగదు బహుమతి, ధ్రువపత్రాలు, షీల్డ్‌ను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అందజేశారు. అభినందించిన వారిలో అధ్యాపకులు విజయ్‌కుమార్, ఆజయ్‌కుమార్ ఉన్నారు.

## ముగిసిన ఎస్ఎ పరీక్షలు

**టెక్కలి :** విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన ఎస్ఎ-3 పరీక్షలు గురువారంతో ముగిశాయి. మూడు రోజుల క్రితం ప్రారంభమైన ఈ పరీక్షలు రోజుకు రెండు చొప్పున విద్యార్థులకు ఇచ్చిన ఒఎంఆర్ షీట్లను మండల విద్యాశాఖ కార్యాలయానికి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందజేశారు. ఏరోజుకారోజు ప్రశ్నపత్రాలు సమీపంలో ఉన్న పాఠశాలల సముదాయాల నుంచి అందజేశారు. విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలను ఉపాధ్యాయులు మూల్యాంకనం చేపట్టి మార్కులను రిజిస్టర్‌లో పొందుపరుస్తారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసే పనులు త్వరితగతిన చేపట్టనున్నారు.

## అరసవల్లికి వెళ్లే దారిమళ్లింపు

**ప్రజాశక్తి- పాతపట్నం**

ఫిబ్రవరి 4 నుంచి రథసప్తమి ఉత్సవాలు సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి మండలంలోని పలు గ్రామాల నుంచి వెళ్లే యాత్రికులకు, వాహనదారులకు దారి మళ్లించామని సిఐ వి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్లే వాహనదారులు పెద్దపాడు, శాస్త్రులపేట, సానివాడ మీదుగా ఒప్పంగికి చేరుకోవాలన్నారు. అక్కడ నుంచి వాడాడ కూడలి నుంచి అరసవల్లి పుష్కరిణికి చేరుకోవాలని సూచించారు. శ్రీకాకుళంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా దారి మళ్లించామని తెలిపారు.

మొక్కలు నాటుతున్న సూర్యనారాయణ

## విరివిగా మొక్కలు నాటాలి

**ప్రజాశక్తి- పలాస**

ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ సూర్యనారాయణ అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలో గురువారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయం ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుకు పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. వాటి స్థానంలో పూల, మారేడు, జువ్వి, నేరేడు తదితర మొక్కలను నాటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇలు ప్రసన్నకుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను సన్మానం చేస్తున్న నాయకులు

## పార్టీ పదవులపై హర్షం

**ప్రజాశక్తి- రణస్థలం రూరల్**

వైసిపి ఎచ్చెర్ల నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షులు గురాన తిరుమల మానస, ఎచ్చెర్ల నియోజకవర్గం స్టూడెంట్ వింగ్ అధ్యక్షునిగా ముద్దాడ రాజశేఖర యాదవ్‌ను నియమించటంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ను మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తిరుమల మానస, రాజశేఖర్ యాదవ్‌లు మాట్లాడుతూ వారిపై ఎంతో నమ్మకంతో పార్టీ పదవి భాధ్యతలు అప్పగించటం మరింత భాధ్యత పెరిగిందన్నారు. అందరిని సమన్వయం చేస్తూ పార్టీ బలోపేతనికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొంతు సూర్యనారాయణ, దన్నాన హరి, మజ్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 2న సూర్య నమస్కారాలు

మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 2న నగరంలోని 80 అడుగుల రోడ్డులో జరగనున్న సామూహిక సూర్య నమస్కారాలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయుష్ సీనియర్ వైద్యాధికారి పి.జగదీష్ కోరారు. నగరంలోని ఆయుష్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో సామూహిక సూర్య నమస్కారాలు ఏర్పాట్లకు సంబంధించి వివిధ యోగా సెంటర్ల కన్వీనర్లతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామూహిక సూర్య నమస్కారాలు కార్యక్రమానికి సుమారు 5 వేల మంది యోగా సాధకులు హాజరవుతున్నారని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అందరూ కలిసికట్టుగా కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, పతాంజలి యోగా కన్వీనర్ దుంపల చిన్నబాబు, సూర్యప్రణవ కో-ఆర్డినేటర్ తంగి స్వాతి, ఆయుష్ సిబ్బంది శేఖర్, యోగా కన్వీనర్ పాండ్రంకి మురళీకృష్ణ, శిక్షకులు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పురస్కారం

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి చదువుతున్న విద్యార్థి తాన్ని పూర్ణకు నగదు బహుమతి వరించింది. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థి పూర్ణను విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన భేటీ బచావో - భేటీ పడావో కార్యక్రమంలో రూ.2500 నగదు బహుమతి జ్ఞాపికను అందుకుంది. ఈ విద్యార్థి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 434 మార్కులను సాధించినందుకు ఈ బహుమతిని సొంతం

పూర్ణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్యామ్ సుందర్

చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్యామ్ సుందర్ తెలిపారు. పూర్ణను ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## రాజమహేంద్రవరంలో నృత్య ప్రదర్శన

నృత్యప్రదర్శనకు సిద్ధమవుతున్న కళాకారులు

**ప్రజాశక్తి- ఇచ్ఛాపురం**

లాస్యప్రియ కూచిపూడి నృత్యనికేతన్ రాజమహేంద్రవరంలో నిర్వహించి ఇండియన్ కల్చర్ ఆర్ట్స్ ఫెస్టివల్ 6నేషనల్ డాన్స్ అండ్ మూజిక్ ఫెస్టివల్-25 ఫిబ్రవరి 1,2న నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఇచ్ఛాపురానికి చెందిన శ్రీస్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి, భరతనాట్యం, జానపద నాట్య ప్రదర్శనకు ఎంపికయ్యారు. నాట్య గురువు మంగి దివ్య, డి.ఉపాసన, ఎం.తేజేశ్రీ, ఎం.వర్షిని, ఎస్.లాస్య, సిహెచ్.భూమిక, పి.చార్వి, శ్రావణి, డి.యశోద, భవ్యశ్రీ లిమయిలు నృత్యం చేయనున్నారు. ఈ నాట్య ప్రదర్శనకు ఎంపికైన కళాకారులకు అకాడమీ నాట్య గురువు మంగి దివ్య, అధ్యక్షులు కె.గోవిందరావు, కోశాధికారి మందితాలమ్మలు అభినందించారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**ప్రజాశక్తి - భోగాపురం**

మండలంలోని పోలిపల్లి, మహారాజుపేట ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు దివిస్ కంపెనీ యాజమాన్యం జిల్లా కామన్ ఎంట్రన్స్ బోర్డు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేసింది. పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 63 మందికి ప్రధానోపాధ్యాయులు ఇందిర ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మహారాజపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ ఆధ్వర్యంలో 48 విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి శతశాతం ఉత్తీర్ణతతో పాటు, ప్రతి సబ్జెక్టులో ఎక్కువ మార్కులు స్కోర్ చేయవచ్చునని పాఠశాల ఉపాధ్యాయులు తెలియజేశారు. దివిస్ కంపెనీ సిఎస్ఆర్ ప్రతినిధి ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు ఇంకా 40 రోజులు మాత్రమే సమయం ఉన్నందున ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రణాళిక ప్రకారం ఈ స్టడీ మెటీరియల్ అనుసరించి చదివినట్లయితే శతశాతం ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోపికి సన్మానం

**పలాస :** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ వైసిపి పట్టణ అధ్యక్షుడు శిష్టి గోపికు వైసిపి పట్టణ అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ యువత గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొత్తపల్లి వాసు, బోనెల గణపతి, లండ పాపారావు, నెయ్యల శివకుమార్, నందిగాం ప్రసాద్, తోట సోమేశ్, కొవ్వురు రాజేష్, కరుమూజు లక్ష్మీపతి పాల్గొన్నారు.

## ప్రథమ చికిత్సపై అవగాహన

**టెక్కలి :** రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు గాయపడిన వారికి ఇచ్చే ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ చికిత్స నిర్వహణపై అవగాహనతో పాటు వాటిని ఏ విధంగా చేయాలో అన్నది నమూనా చేసి చూపించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్, లూక్‌పాల్, కందిగోల్ల, వాసుబాబు, సుగుణాకరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న టిడిపి నాయకులు

## డిఎస్‌పికి సన్మానం

**పలాస:** కాశీబుగ్గ డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి కె.వెంకట అప్పారావును గురువారం ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు టిడిపి నాయకులు సాసుమాన చంద్రమౌళి, యవ్వారి మోహనరావు తదితరులు ఉన్నారు.

## పాఠశాలల ఆకస్మిక తనిఖీ

**ఇచ్ఛాపురం:** మండలంలోని వివిధ పాఠశాలలకు ఎంఇఒ1,2 కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎంఇఒ-1 అయ్యవారిపేట, జగన్నాధపురం పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి ఎండిఎం సిబ్బందికి పలు సూచలు చేశారు. ఎంఇఒ-2 తిప్పనపుట్టుగ పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ముత్యాలమ్మపేట పాఠశాలను, భవిత కేంద్రాన్ని పర్యవేక్షించారు. రత్తకన్న కాంప్లెక్స్ చైర్మన్ పావని కుమారి ఎస్.మండపల్లి పాఠశాల సందర్శించారు.

## దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

**పాతపట్నం:** పాతపట్నం మండలంలోని ఆంధ్ర పత్రిక విలేకరి పెద్దింటి తిరుపతిరావుపై ఇటీవల కాలంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విలేకరులు కోరారు. ఈ మేరకు సిఐ వి.రామారావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్రికల్లో నిజాలు రాస్తే విలేకరులపై దాడి చేయడం సరికాదన్నారు. విలేకరులకు రక్షణ కల్పించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఈనాడు శేఖర్, సాక్షి రవి, సుధాకర్, అశోక్‌కుమార్, శ్రీనివాసరావు ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు